రౌడీషీటర్లపై నిరంతరం నిఘా పెట్టాలి

- నేర విచారణ మరింత సమర్థవంతంగా నిర్వహించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్, నవంబర్ 29 : వివిధ నేరాల్లో నిందితులుగా ఉన్న రౌడీషీటర్స్‌పై నిరంతరం నిఘా పెట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వేములవాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులతో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో పాల్గొని, ఆయన మాట్లాడారు. నేర విచారణ మరింత సమర్థవంతంగా నిర్వహించి, సత్వరం పరిష్కారించేలా పోలీస్ అధికారులంతా పనిచేయాలన్నారు. పోలీస్ శాఖ అందిస్తున్న సాంకేతికను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులు కలిగించే వారిపై కొత్తగా రౌడీషీట్లు తెరవాలని ఆదేశించారు. జిల్లాల, రాష్ట్రాల సరిహద్దుల నుంచి వచ్చే గంజాయి మూలాలను గుర్తించి, పకడ్బందీగా నియంత్రించాలన్నారు. కీలక వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి, పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐలు వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, మధుకర్, ఎస్ఐలు, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహ స్వామి కల్యాణం

ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్, చైర్మన్, భక్తులు

రుద్రంగి, నవంబర్ 29 : మండలంలోని మానాల గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి వారి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర యూనియన్ కోపరేటివ్ చైర్మన్ మోహన్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేశారు.

సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నినాదాలు చేస్తున్న దేశపతి శ్రీనివాస్

దీక్షా దివస్ కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

దీక్షా దివస్‌కు తరలిన బీఆర్ఎస్ నేతలు

ముస్తాబాద్ : దీక్షా దివస్‌కు జిల్లా కేంద్రానికి తరలుతున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రంగి : దీక్షా దివస్‌కు తరలిన సెస్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్, నవంబర్ 29 : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ దీక్షా దివస్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు సురేందర్రావు పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి నాయకులు కొమ్ము బాలయ్య సర్వర్ పాషా, మాజీ సర్పంచ్ గాండ్ల సుమతి, సంతోష్‌రావు, రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, చాడశ్రీనివాస్, సంతోష్‌గౌడ్, నల్లనర్సయ్య, ఎల్లం, నారాయణ, భరత్, చెవుల మల్లేశ్‌యాదవ్ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు.

రుద్రంగి, నవంబర్ 29 : దీక్షా దివస్ కార్యక్రమానికి మండలం నుంచి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కోసం కేసీఆర్ ఆ రోజు ప్రాణత్యాగానికి కూడా వెనుకాడలేదన్నారు. ఆయన గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సినవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కంటె రెడ్డి, నాయకులు గంగం మహేశ్, మాడిశెట్టి ఆనందం, సుందర్‌నాయక్, తలారీ నర్సయ్య, మోహన్, గజన్‌లాల్, చెప్యాల గణేశ్, దుబ్బ రవి, అల్లూరి గంగారెడ్డి, దయ్యాల నారాయణ, సింగారపు గంగారెడ్డి, సంగారపు గంగాధర్, నరేశ్, వెంకటేశ్‌తో పాటు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలి : సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్

కలెక్టరేట్, నవంబర్ 29: డబల్ బెడ్ రూమ్ డ్రాలో రానివారికి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి ప్రాధ్యాన్యత ఇచ్చి నివాస స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకోవడానికి రూ. ఐదు లక్షలు అందించాలని సిరిసిల్లా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి సీపీఎం సిరిసిల్ల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, సీపీఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి ఇల్లు లేక కిరాయికుంటూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు కోడం రమణ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సూరం పద్మ, ఎలిగేటి రాజశేఖర్ బె జిగం సురేశ్. వీరేశం మోర తిరుపతి నల్ల బాలు దాసరి రూప గట్ల సప్న బోనాల లక్ష్మి 150 మంది డబల్ బెడ్ రూమ్ వాళ్లు పాల్గొన్నారు.

కేకేకు వినతిపత్రం ఇస్తున్న నాయకుడు రమేశ్

భక్తజన సంద్రం.. రాజన్న ఆలయం

ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబర్ 29 : కార్తీకమాసం అందులో మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా రాజన్న సన్నిధి శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయమే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానమాచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం స్వామివారి ప్రీతి మొక్కైన కోడెమొక్కు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. రాజన్నను దాదాపు 35 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు రూ. 18 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై అంజయ్య బందోబస్తును ఏర్పాటు చేశారు.

కనుల పండువలా మహాలింగార్చన

మాసశివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయంలో శుక్రవారం రాత్రి మహాలింగార్చన అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయం రాజన్నకు 11 మంది రుత్వికులతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అభిషేకపూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాలతో ఆలయం మారుమ్రోగింది.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కోనరావుపేట, నవంబర్ 29 : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మరిమడ్ల గ్రామంలో ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలిసి మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్, వంట నిర్వాహకులకు సూచించారు. అనంతరం కోనరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో 44 మందికి 14 లక్షల 30 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, స్థానిక నేతలతో కలిసి పంపిణీ చేశారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి : ఎస్ఐ

టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్

ఇల్లంతకుంట, నవంబర్ 29 : యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పొత్తూరు గ్రామంలో నూతనంగా టీ స్టాల్ ఏర్పాటు చేయగా, ఎస్ఐ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో యువత తమ సమయాన్ని వృథా చేయకుండా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకొని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. యువత చదువుతో పాటు క్రీడలు, స్వయం ఉపాధి పనులపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండలంలోని మానువాడ సింగిల్ విండో చైర్మన్ దుర్గా రెడ్డి పాల్గొన్నారు.

30న బంద్‌ను విజయవంతం చేయలి

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు

వేములవాడ, నవంబర్ 29 : రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థత చెంద డం, మరికొందరు మృతి చెందడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ 30వ తేదీ శనివారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పిలుపునిచ్చినందున విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ కోరారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహారం తిని విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోగా కనీసం చర్యలకు కూడా ఉపక్రమించకపోవడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు సమస్యలతో సతమతమవుతున్నాయని రక్షణ కరవై, పర్యవేక్షణ లేకుండా పోయాయని ఆరోపించారు. ఏడాది పరిపాలనలో విద్యారంగానికి మంత్రి కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వేములవాడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి భరత్, కడారి శివ, అఖిల్, రాఖీ, అబ్దుల్, మనీష్, సలావుద్దీన్, సాత్విక్, శ్రీహర్ష, శ్రీజ, అక్షయ,రుచిత, వర్షిని ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి, నవంబర్ 29 : కోనరావుపేట మండలం నిమ్మ పెల్లి గ్రామంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని బండపల్లి గ్రామంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు

చందుర్తి, నవంబర్ 29 : మండలంలోని జోగాపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో క్షయ వ్యాధి నిర్మూలనపై శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు, క్షయ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్మూలనపై వైద్య సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ నిజాంబాద్ తిరుపతి, S/o మైసయ్య, R/o. అంబేద్కర్‌నగర్, వేములవాడ పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం, దీని యొక్క ప్లాట్ నెంబరు 1125, దీని యొక్క విస్తీర్ణం: 242.00 చ.గజాలు, దీని యొక్క సర్వేనెంబరు 504, R&R కాలనీ, చింతలఠాణా, నాంపెల్లి గ్రామం, వేములవాడ పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 29-11-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధార్థనగర్, సిరిసిల్ల, జి॥ రాజన్న సిరిసిల్ల.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ బిట్ల అక్షర, W/o బిట్ల రాజశేకర్, R/o. By నగర్, సిరిసిల్ల, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన పెంకుటి ఇల్లు (H.No. 1-6-78) లోని కొంత భాగం మరియు దీని యొక్క ఖాళీస్థలం మొత్తం విస్తీర్ణం: 55.55 చ.గజాలు, పద్మనగర్ కాలనీ, సిరిసిల్ల పట్టణం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 29-11-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్సి., ఎల్.ఎల్.బి.,
సిద్ధార్థనగర్, సిరిసిల్ల, జి॥ రాజన్న సిరిసిల్ల.

దివ్యాంగులకు సంక్షేమాధికారి అభినందన

అభినందిస్తున్న దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ

కలెక్టరేట్, నవంబర్ 29 : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి దివ్యాంగుల పోటీలు నిర్వహించగా రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన ఎం కార్తీక్, ఎం అర్చన రాష్ట్ర స్థాయి బహుమతులు గెలుచుకున్నారు. కాగా, శుక్రవారం దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బీ శైలజ బహుమతులు అందజేశారు. సీనియర్ అంధుల రన్నింగ్ పోటీలో వెంకటాపూర్‌కు చెందిన ఎం కార్తీక్, ఆర్థోపెడిక్ షాట్‌పుట్ పోటీలో చంద్రంపేటకు చెందిన ఎం అర్చనలు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. శుక్రవారం సిరిసిల్ల కలెక్టరేట్‌లో సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం ఎం కార్తీక్, ఎం అర్చనను అభినందించారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రణయ్, కే అనిల్, ఎం కార్తీక్, అర్చన, రజని, నర్సయ్య, జీ రవి, శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు పండుగకు ఆహ్వానం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- రైతులు తరలిరావాలి

కలెక్టరేట్, నవంబర్ 29: ఈ నెల 30న (శనివారం) రైతు పండుగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కలెక్టర్ సందీప్ కు మార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. రైతు పండుగ వేడుకల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రైతులను ఉద్దేశించి శనివారం మధ్యాహ్నం 2 గం టల నుంచి ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని 13 రైతు వేదికలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైతు సోదరులందరూ తమ గ్రామాలకి సమీపంలోని సోదరులందరూ పెద్ద సంఖ్యలో రైతు వేదికలకు తరలివచ్చి, సీఎం ప్రసంగాన్ని వీక్షించాలని తెలిపారు.

ఆదర్శపాఠశాల తనిఖీ

బోయినపల్లి, నవంబరు 29: బోయినపల్లి ఆదర్శ పాఠశాలలో హాస్టల్ వార్డెన్‌పై ఎంపీడీవో జయశీల ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బోయినపల్లి ఆదర్శ పాఠశాలను ఎంపీడీవో జయశీల ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ముందుగా బాలికల హాస్టల్‌ను సందర్శించి వంట గది శుభ్రతను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం బాలికల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేస్తున్న పిల్లలను సరిగా వంట చేస్తున్నారా.. రుచికరమైన భోజనం ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చాలా మంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచి లంచ్ బాక్సులు తీసుకొచ్చుకోవడం గమనించిన ఎంపీడీవో జయశీల ఇక నుంచి మీరు ఎలాంటి టిఫిన్ బాక్సులు తీసుకొచ్చు కోవద్దని మధ్యాహ్నం ఇక్కడే భోజనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రవన్‌కుమార్,ప్రిన్సిపాల్ రఘు నాథ్, కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

స్త్రీ హింస వ్యతిరేక చట్టం తెలియాలి

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 29 : స్త్రీ హింస వ్యతిరేక చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం కౌన్సిలర్ అంజలి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వజూనియర్ కళాశాలలో స్త్రీ హింస వ్యతిరేక పక్షోత్సవాల సందర్భంగా అవగాహన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గృహహింస, మానసిక హింస, వరకట్న హిం సపై వివరించారు. ఇలాంటి హింసపై మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా సఖీ కేంద్రానికి సమాచారం ఇచ్చి సేవలు పొందాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



దూస వెంకటేశ్ (ఫైల్)

కోనరావుపేట, నవంబర్ 29 : అప్పుల బాధతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన దూస సత్యనారాయణ-కవిత దంపతులుకు కూతురు నిఖిత, కుమారుడు వెంకటేశ్ (34) ఉన్నారు. ఈ క్రమంలో వెంకటేశ్‌కు వివాహం కాగా, వేములవాడ బట్టలషాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దీంతో రోజువారీగా చేసిన కూలీ సరిపోకపోవడం ఇంటి అవసరాల కోసం చేసిన అప్పులు ఎక్కువ కావడంతో చేసేదేమి లేక ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ కూడా పనిసరిగా లేకపోవడంతో వెళ్లిన నాలుగు నెలలకే ఇంటికి తిరిగి వచ్చాడు. దీంతో చేసేదేమి లేక వేములవాడలో కూలీ పనికి వెళ్లాడు. ఈ క్రమంలో చేసిన అప్పు సుమారు రూ.10 లక్షలు కావడంతో పాటు చేసిన కూలీ కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ నెల 21న వేములవాడ పరిధిలోని కోనాయపల్లి ఎల్లమ్మ వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. వెంటనే ఫోన్ వాట్సాప్‌లో మందు తాగినట్లు స్టేటస్ పెట్టడంతో గమనించిన స్నేహితులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని వెంకటేశ్‌ను ఎల్లారెడ్డిపేటలోని అశ్విని దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సంధ్య, కూతుళ్లు నిత్యశ్రీ, నయనశ్రీ ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయికి దమ్మన్నపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు

గంభీరావుపేట, నవంబర్ 29 : మండలంలోని దమ్మన్నపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు చెకుముఖి సైన్సు టాలెంట్ టెస్టులో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగినేని ట్రస్టులో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్సు టాలెంట్ టెస్టులో పాఠశాల నుంచి విష్ణుదీప్, మణిదీప్, వర్ష విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు.

విద్యార్థులకు స్వెటర్లు అందజేత

గంభీరావుపేట, నవంబర్ 29 : మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో శుక్రవారం 65 మంది విద్యార్థులకు స్వెటర్లను వితరణగా అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు శైమరామ సమకూర్చిన స్వెటర్లను విద్యార్థులకు మండల విద్యాధికారి గంగారాం, పాఠశాల హెచ్‌ం దేవయ్య కలిసి అందజేశారు.

సన్నవడ్ల బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట, నవంబర్ 29 : ప్రభుత్వం సన్నవడ్లకు అందిస్తున్న బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసుకున్న విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తాము పండించిన వరి ధాన్యం విక్రయిస్తూ మద్దతు ధరను పొందాలన్నారు. వైస్ చైర్మన్ అంజిరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మండలాధ్యక్షుడు హమీద్, ఏఎంసీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చందుర్తిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

చందుర్తి, నవంబర్ 29 : చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం 12 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సంపత్ తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి డిసెంబర్ 4 వరకు ఆరు రోజులపాటు వేములవాడ ఏరియా దవాఖానలో కుటుంబ నియంత్రణ సస్ర శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కుటుంబ నియంత్రణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి సంపత్ కోరారు.

మహా పడి పూజ

సిరిసిల్ల టౌన్, నవంబర్ 29 : సిరిసిల్ల పట్టణానికి చెందిన అయ్యప్ప భక్తుడు, గురుస్వామి గూడెపు లక్ష్మీనారాయణ 18వ స్వారి శబరి యాత్రకు వెళ్తున్న సందర్భంగా శుక్రవారం స్థానిక సాయికృష్ణ కల్యాణ మండపంలో మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి చెరుకు రసంతో అభిషేకం చేశారు. 18వ సారి శబరియాత్రకు వెళ్తున్న సందర్భంగా గురుస్వామి రాచ విద్యాసాగర్ పడిపూజ నిర్వాహకుడు గూడెపు లక్ష్మీనారాయణకు స్వర్ణ కంకణం తొడిగి అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు ఎరుకల ప్రకాశ్, దుబ్బ విశ్వనాథం పాల్గొన్నారు.

గణిత పోటీల్లో ప్రతిభ చూపిన పోతుగల్ విద్యార్థి గణేశ్



పోతుగల్ విద్యార్థి చరణ్

ముస్తాబాద్, నవంబర్ 29 : పదో తరగతి విద్యార్థుల కోసం మండలస్థాయిలో నిర్వహించిన గణిత ప్రతిభాపాటవ పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతుగల్ విద్యార్థులు మంచి ప్రతిభ చాటారని హెచ్‌ఎం రాధాకిషన్‌రావు తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో రాగుల చరణ్, తృతీయ స్థానంలో లకావత్ గణేశ్ నిలిచారన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సురభి రాధాకిషన్ రావు, గణిత ఉపాధ్యాయులు కృష్ణమాచారి, మంజుల విద్యార్థులను అభినందించారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతలు స్వీకరణ

వేములవాడ రూరల్, నవంబర్ 29: వేములవాడ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం శుక్రవారం పదవి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్‌గా రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేశ్‌తో పాటు డైరెక్టర్ బాధ్యలు స్వీకరించారు. డిసెంబర్ మొద టి వారంలో ప్రమాణ స్వీకారం పెద్ద ఎత్తు న్ననిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

వీర్నపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా వాజిద్

వీర్నపల్లి, నవంబర్ 29 : ఇన్‌చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అబ్దుల్ వాజిద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రఘురాం జీఐఆర్డీకి బదిలీ అయ్యారు. ఎంపీవోగా విధులు నిర్వర్తిస్తున్న వాజిద్‌కు ఉన్నతాధికారులు ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. వజీద్‌కు మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు స్థలం కేటాయింపు

వేములవాడ, నవంబర్ 29 : వేములవాడ ఏరియా దవాఖాన ఆవరణలో బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణానికి వేయి గజాల స్థలాన్ని కేటాయిస్తూ సంబంధిత అధికారులకు శుక్రవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అనుమతి పత్రాన్ని అందజేశారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు ద్వారా వేములవాడ నియోజకవర్గ ప్రజలతో పాటు రాజన్న సన్నిధి వచ్చే భక్తులకు అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా వైద్యాధికారి వసంతరావు, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ పెంచలయ్య తదితరులు ఉన్నారు.

మెగా కు.ని శిబిరం

వేములవాడ ఏరియా దవాఖానలో శుక్రవారం మెగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స శిబిరాన్ని నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికారి వసంతరావు తెలిపారు. ఈ శిబిరంలో 65మంది పురుషులకు శస్త్ర చికిత్సలు నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు పెంచలయ్య, రవీందర్, రమేశ్, అంజలి, నయీమా, ఏవో శ్రీనివాస్, రాజ్ కుమార్, బాలయ్య, యాదగిరి ఉన్నారు.

వరి కొయ్యకాలు తగులబెట్టొద్దు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 29 : రైతులు వరి కొయ్యకాలు, పంట అవశేషాలు తగులబెట్ట వద్దని వ్యవసాయాధికారి కవిత రైతులకు సూచించారు. శుక్రవారం అల్మాస్‌పూర్ రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యకాలు తగులబెడితే పంట మిత్ర పురుగుల నశించి భూసారం తగ్గుతుందన్నారు. వరి కొయ్యకాలను కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని సూచించారు. రైతులు, సిబ్బంది ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి ముందుకొస్తున్న దాతలు



నగదు అందజేస్తున్న కుర్మ సంఘం నేతలు

ముస్తాబాద్, నవంబర్ 29 : మండలంలోని గూడెం గ్రామంలో అతి పురాతన సత్యనారాయణ స్వామి ఆలయం పునరుద్ధరణ పనులు స్థానికులు ప్రారంభించడంతో స్థానికులు వివిధ రకాలుగా సహకారం అందిస్తున్నారు. శుక్రవారం గ్రామంలో శ్రీ చండీశ్వర బీరప్ప కురుమ, సంక్షేమ సంఘం సభ్యులు సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ కమిటీకి రూ. 25,116 నగదు అందించారు. దాతలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

దేశాయిపల్లిలో వెబ్ మినీ సినిమా చిత్రీకరణ

బోయినపల్లి, నవంబరు 29 : దేశాయిపల్లిలో శుక్రవారం వెబ్ మినీ సినిమా చిత్రికరణ చేశారు. హైదరాబాద్‌కు చెందిన టెక్ అడియ దాస్ అనె ఎంటర్ టెన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 1990లో తెలంగాణ ప్రజల జీవణ స్థితి గతులు ఏవిధంగా ఉన్నాయని, అప్పటి ప్రజల జీవన విధానం, దోస్తులు ఏ విధంగా ఉన్నారు, సంస్కృతి, పల్లె ప్రజలు ఏ విధంగా జీవిస్తున్నారు అనే దానిపై సినిమాతో పాటు, సీరియల్ చిత్రీకరించారు. కానీ, నామకరణం చేయలేదని నిర్వాహకులు తెలిపారు.